బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కాడెం సుధాకర్



అత్తాపూర్: హైదర్‌గూడకు చెందిన కాడెం సుధాకర్ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ధర్మం కోసం పని చేసే పార్టీలో నరేంద్రమోదీ నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. రెండోసారి తనను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించడంతో మరింత బాధ్యతతో పని చేస్తానన్నారు.

గణేషుడికి బెల్లంతో అలంకారం

రాయదుర్గం: సంకష్టహర చవితిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలోని గణపతికి పూలు, అత్యంత ఇష్టమైన బెల్లం ముద్దలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అనంతరం గణపతికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అంతేకాకుండా ఆలయంలో షిర్డీసాయిబాబా, కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలను కూడా నిర్వహించారు.

ఫుడ్‌స్టాల్స్, పీజీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్ నగర్‌కాలనీలో ఫుడ్‌స్టాల్స్, పీజీ హాస్టళ్లలో కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్, ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేశారు. తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదు రాకుండా పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు వండేలా వాటిని వినియోగదారులకు అందించేలా చూడాలని ఆదేశించారు.

కాలనీలు, బస్తీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

గచ్చిబౌలి: అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ సీఎంసీ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ వినతిపై ఆయన మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అసంపూర్తిగా మిగిలిన సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, యూజీడీ పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, వీధిదీపాలను వెలిగేలా చూడాలని కోరారు. వాటర్ ట్యాంకర్లతో కాలనీలో ఏర్పడిన ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కాలనీలో అన్ని సమస్యలకు త్వరలో మోక్షం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, మహేష్, సాంబశివరావు, రామ్మోహన్, మురళీకృష్ణ,మూర్తి, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

'42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బీసీ ఉద్యమం దశ–దిశ అనే అంశం పై ఓయూ ప్రొఫెసర్లు, స్కాలర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో చర్చాగోష్టి జరిగింది. బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా బీసీ నాయకత్వంలో నూతన స్థాపించాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. సామాజిక జేఏసీ చైర్మన్ ప్రొ.ప్రభంజన్ యాదవ్ అధ్యక్షత వహించగా డా.దేశగాని సాంబశివగౌడ్, డా.మాండ్ల రవి, ఓయూ అధ్యాపకులు ప్రొ.రాములు, డా.రామ్‌షఫర్డ్ తదితరులు ప్రసంగించారు.

జాబ్‌మేళాల నిర్వహణ అభినందనీయం

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ కళాశాలల్లో స్వచ్ఛంద సంస్థలు జాబ్‌మేళా నిర్వహించి విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడం అభినందనీయమని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ అన్నారు. నాంపల్లిలోని కళాశాలలో టీఎన్‌ఎస్ ఇండియా ఫౌండేషన్ బృందానికి కళాశాల తరపున ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో కళాశాలలో ప్లేస్‌మెంట్ నిర్వహించి 52 మంది విద్యార్థులను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను వివరించాలి

గన్‌ఫౌండ్రీ: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రస్తుత సమాజానికి వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనా రెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, నగర కార్యదర్శి ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు..!

- తవ్వి..వదిలేసిన పద్మనాభనగర్ కాలనీ రహదారి
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తవ్వకాలతో ఎండిన మొక్కలు



పద్మనాభనగర్ కాలనీ సర్వీస్ రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

గోల్కొండ: కాలనీల సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయి. అభివృద్ధి పనులపేరిట రోడ్లను తవ్విన అధికారులు సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నానల్‌నగర్ డివిజన్‌లోని పద్మనాభనగర్ కాలనీ సర్వీస్ రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. రేతిభౌలి రింగ్ రోడ్డు నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వైపు వెళ్లే రోడ్డు వైపున పద్మనాభనగర్ కాలనీ, కరోల్‌బాగ్ కాలనీ ఉన్నాయి. మెయిన్ రోడ్డుకు ఆనుకుని సర్వీస్ రోడ్డు ఉంది. దానికి ఆనుకునే బల్దియా వారు గ్రీనరీ ఏర్పాటు చేశారు. అయితే రోడ్ల అభివృద్ధికి చేపట్టిన తవ్వకాలు పచ్చని చెట్లకు శాపంగా మారాయి. అడ్డదిడ్డ తవ్వకాలతో పచ్చని చెట్లు సైతం ఎండిపోతున్నాయి. నెలల తరబడి పనులు పూర్తికాకపోవడంతో కాలనీవాసులతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అంతర్గత రోడ్లు సైతం..

టోలిచౌకీ అల్‌హస్‌నత్ కాలనీ, నిజాం కాలనీల్లోని రోడ్లను అభివృద్ధి పనుల పేరిట తవ్వడంతో అవి కూడా అధ్వానంగా తయారయ్యాయి. దీనికితోడు కాలనీవాసులు తమ ఇళ్లకు వివిధ కారణాలతో రోడ్డును తవ్వి పైపులు వేసి అలాగే వదిలేస్తున్నారు. ఈ కారణంగా అక్కడ రోడ్డు మొత్తం దెబ్బతింటోంది. టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్, ఖాదర్‌బాగ్ కాలనీల రోడ్లు సైతం నీటి, డ్రైనేజీ పైపులు వేసేందుకు తవ్వి అలాగే వదిలేస్తున్నారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, అలాగే అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సకాలంలో పూర్తి కావడం లేదు. దీనికితోడూ నాణ్యతా ప్రమాణాలు సైతం పాటించడం లేదు. అసంపూర్తి పనులతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరమే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

–కె.కృష్ణా, కార్వాన్

భవానీకాలనీలో హైడ్రా అధికారుల పర్యటన



భవానీకాలనీ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బండ్లగూడ: పార్కు, ఆలయ, వాటర్ ట్యాంకర్ స్థలాలు కబ్జాకు గురువుతున్నాయని పరిరక్షించాలని కోరుతూ భవానీకాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు మంగళవారం భవానీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా స్థలాలను పరిశీలించారు. స్థల పరిమితులు, భూస్వామ్య వివరాలు, భవిష్యత్‌లో ఈ స్థలాలను అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాథమిక అధ్యాయనం ప్రారంభించారు. స్థలాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైడ్రా టీం సీఐ తిరుమల్లేశ్, కాలనీ వాసులు అశోక్, శ్రీనివాస్, మల్లేశ్, మరిమల్‌రాజ్, రవిబొల్ల, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోజ్, వినోద్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మణికొండ: వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మణికొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడుతూ.. మణికొండ ఉన్నత పాఠశాల 10 మంది విద్యార్థులతో ప్రారంభం కాగా ప్రస్తుతం 1300 మంది చదువుతున్నారన్నారు. గతేడాది 87 శాతం ఫలితాలతో మండలంలో మొదటి స్థానంలో నిలిచిందని, ఈసారి జిల్లాలోనే అగ్రభాగంలో నిలవాలని ఆకాంక్షించారు. అలాగే పరీక్షలు ఎలా రాయాలనే నిబంధనలను ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యలాల నరేశ్, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రవీకాంత్‌రెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, ఎ.కుమార్, రాజేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లతోనే వేగ నియంత్రణ



స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మణికొండ: స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతోనే వేగ నియంత్రణ సాధ్యమని నార్సింగి ట్రాఫిక్ సీఐ ఎం. నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎస్సై రాజేశ్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీతో కలిసి అలకాపూర్ టౌన్‌షిప్, ఈవీవీ కాలనీ, పయనీర్ కాలనీ, గోల్డన్ టెంపుల్ రోడ్డు, తిరుమలహిల్స్‌నె ఎస్సార్ కాలనీల్లో మంగళవారం పర్యటించారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. అలాగే రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శివసాయి, ఏఈ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో 'గుడ్ మార్నింగ్ మణికొండ'



ప్రజలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు డి.సీతారాం నాయకులతో కలిసి వినాయక్‌నగర్‌లో 'గుడ్ మార్నింగ్ మణికొండ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో తమ కాలనీ ద్వారా పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుండడంతో ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే వర్షాకాలంలో వరద నీరంతా తమ కాలనీలోకి వస్తున్నదని డ్రైనేజీని ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతూ కృషి చేస్తామని ఆయ హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, జి. విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గోల్కొండ: కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని, అందుకు బీసీలకు 43 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడమే నిదర్శమని కాంగ్రెస్ కార్వాన్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాలకు అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీద్‌ఖాన్, నర్సింగ్‌గౌడ్, రాంకుమార్, ప్రేమ్‌కిశోర్, పరమానందం, షేక్ షకీలా, శారదా, గిరిజ తదితరులు ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

గోల్కొండ: 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని ఈనెల 19న (నేడు) నిర్వహించనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 9959226133 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాలేజీలో మహిళా దినోత్సవం..

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19న (నేడు) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఉమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ పేరిట ఈనెల 19, 20 నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్ఫోసిస్ సెంటర్ హెడ్ ప్రెసిడెంట్ మనీషా సబు, స్కై రూట్స్ ఏరోస్పేస్ కోఫౌండర్ నాగభరత్ డాకా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు కాలనీలలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ కోరారు. జోనల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో సరైన విధంగా లైట్లు వెలగడం లేదని, కొన్ని అసలే లేవని, పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారని జెడ్సీ దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ పనులు, కొత్తగా ప్రతిపాదించిన వాటికి అవసరమైన నిధులు మంజూరు చేసి అవి పూర్తయ్యేలా చూడాలని కోరారు.

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

గోల్కొండ: ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.శేఖర్ అన్నారు. నానల్‌నగర్ సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని హనుమాన్ ఆలయం ఆనుకోని ఉన్న 100 గజాల ఆలయ స్థలం చుట్టూ అధికారులతో కలిసి మంగళవారం ప్రహరీ ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించి కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు కబ్జాకు గురయ్యాయని కోర్టులు, ట్రిబ్యునల్స్ తీర్పుల మేరకు కబ్జా అయిన స్థలాలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఆలయ నిర్వహణ కమిటీ మాజీ ప్రతినిధులు సైతం స్థల పరిరక్షణకు సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత, ఇన్‌స్పెక్టర్ సురేఖ్, సురేందర్, ఆలయ కమిటీ మాజీ ప్రతినిధులు నర్సింహ్మా, ఎస్.జనార్దన్ తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద దేవాదాయ శాఖ అధికారులు

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

మైలార్‌దేవ్‌పల్లి: బుద్వేల్ రైల్వేస్టేషన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డులోని జేఎస్ బేకరీ ప్రాంతంలో మానవ సేవే మాధవ సేవ, వైఆర్‌జీకేర్, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలువురికి షుగర్, బీపీ, హెచ్‌ఐవీ వంటి పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని సంపూర్ణ సురక్ష కేంద్రం ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కొంపల్లి జగదీశ్, డాక్టర్ చేతన్, ఐసీటీసీ కౌన్సిలర్లు రమణరెడ్డి, బొదిరెడ్డి, జేమ్స్, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ జి.శ్రీకాంత్, డైరెక్టర్లు రమేశ్‌రెడ్డి, గొంత్యాల శ్రీనివాస్, హేమలత, గాయత్రీ, పీహెచ్‌ఎంటీ చంద్రకళ, ఎంపీహెచ్ఏ శిరీషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు ఖాకీ దుస్తులు అందజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

శంషాబాద్: డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం సూచించారు. బీఎంఎస్ ఆటో, ట్యాక్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా ఆధ్వర్యంలో వైఎన్నార్ గార్డెన్‌లో మంగళవారం ట్రాఫిక్ అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు విధిగా ఖాకీ దుస్తులు మాత్రమే ధరించాలన్నారు. అలాగే రాంగ్ సైడ్ డ్రైవింగ్ కారణంగా జరుగుతున్న ప్రమాదాలను వివరించారు. అనంతరం నందకిశోర్ అందజేసిన 50 ఖాకీ దుస్తులను డ్రైవర్లకు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజు, శంషాబాద్ బీఎంఎస్ అధ్యక్షుడు జగదీశ్, రాష్ట్ర నాయకుడు సయ్యద్, రవి, శీను, నరేందర్, చారి, శివ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న శివరాంపల్లి పాఠశాల వార్షికోత్సవం



రాజేంద్రనగర్: పీఎం శ్రీ పథకంలో భాగంగా శివరాంపల్లి పాఠశాల 60 వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవాలని.. అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ సునీత, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయుడు కిషన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణులను అందించాలి

- సాంకేతిక విద్యాబోర్డు కార్యదర్శి ఎ.పుల్లయ్య
- ఆకట్టుకున్న 'సృజన టెక్‌ఫెస్ట్–2025'



టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: పారిశ్రామికరంగాల అవసరాల మేరకు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి నైపుణ్యమైన సాంకేతిక నిపుణులను అందించాలని సాంకేతిక విద్యాబోర్డు కార్యదర్శి ఎ.పుల్లయ్య పేర్కొన్నారు. మాసబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 'సృజన టెక్ ఫెస్ట్–2025 పేరిట మంగళవారం విద్యార్థులకు సాంకేతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహద పడుతాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన 12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అండ్ అలైడ్ బ్రాంచ్ విద్యార్థులు, స్పెషల్ బ్రాంచ్‌లకు సంబంధించిన 4 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్ ఆకట్టుకున్నాయి. పోటీల్లో నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు మొదటి స్థానంలో, సిరిసిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ విభాగంలో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ద్వితీయ స్థానంలో కులీకుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రైజ్‌లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ యేసురత్నం, సీడీఎఫ్‌డీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డాక్టర్ వి.పున్నయ్య, టీజీఎస్‌టీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ కె.సమ్మయ్య, నాట్కో ఫార్మా మేనేజర్ డాక్టర్ నర్మద, డాక్టర్ జహంగీర్, కృష్ణమూర్తి, ఎస్.శ్రీనివాసరావు, జి.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.